పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 113. సూర అల్ ఫలఖ్ పరిచయం

మక్కాలో అవతరించింది. 5 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

విశిష్ఠత : దైవప్రవక్త (స) సూరయె ఫలఖ్, సూరయె నాస్ గురించి ఇలా సెలవిచ్చారు, "ఈ రాత్రి నాపై కొన్ని ఆయత్‌లు ఎలాంటివి అవతరించబడ్డాయంటే, అటువంటి వాటిని నేనెప్పుడూ ఎరుగలేదు" అని, ఆ తర్వాత సూరయె ఫలఖ్, సూరయె నాస్ పఠించారు. (సహీహ్ ముస్లిం – హ.నెం.1348) దైవప్రవక్త (స) హజ్రత్ అబూ హాబిస్ (రజి)తో పలికారు. "నేను నీకు అన్నింటికన్నా ఉత్తమమైన తఅవ్వుజ్ తెలుపనా, రక్షణ కోరేవారు వాటి ద్వారా రక్షణ కోరతారు." ఆయన అన్నారు, "దైవప్రవక్తా (స) తప్పక తెలుపండి." ఆయన (స) అన్నారు, "ముఅవ్వజతైన్, అంటే సూరయె ఫలఖ్ మరియు సూరయె నాస్." (నసాయి – హ.నెం.5432).

దైవప్రవక్త (స) మానవులు, జిన్నుల చెడు దృష్టి (దిష్టి) నుండి రక్షణ కోరుతూ ఉండేవారు. ఈ రెండు సూరాలు అవతరించిన తర్వాత ఆయన (స) వాటిని పఠించడం దినచర్యగా చేసుకున్నారు. మిగిలిన విషయాలను ఆయన (స) మానుకున్నారు. (తిర్మిజి – హ.నెం.2058, అల్లామా అల్ బానీ దీనిని ప్రామాణిక హదీసుగా ఖరారు చేశారు).

హజ్రత్ ఆయిషా (రజి) సెలవిస్తున్నారు, "దైవప్రవక్త (స)కు ఏదయినా బాధ ఎక్కువ అయిపోతే ఈ సూరాలను పఠించి తన శరీరంపై ఊదుకునేవారు." హజ్రత్ ఆయిషా (రజి) తెలియజేస్తున్నారు, "ఆయనకు బాధ ఎక్కువ అయినపుడు నేను ఈ సూరాలను పఠించి ఆయన చేతులను శుభాన్ని ఆశిస్తూ ఆయన శరీరంపై నిమిరేదాన్ని." (బుఖారీ – హ.నెం.4630) ఆయన (స)పై చేతబడి ప్రయోగం చేయబడినప్పుడు హజ్రత్ జిబ్రయీల్ ఈ రెండు సూరాలతో హాజరయ్యారు. ఇలా తెలియజేశారు, "ఒక యూదుడు మీపై మంత్రప్రయోగం చేశాడు. ఆ ప్రయోగం ఫలానా బావిలో జరుపబడింది." ఆయన (స) హజ్రత్ అలీ (రజి)ని పంపి మంత్ర ప్రయోగం చేయబడిన వస్తువులను తెప్పించారు. ఒక దువ్వెనలోని పళ్ళు వెంట్రుకలతో పాటు ఒక దారానికి పదకొండు ముడులు వేయబడి ఉన్నాయి. మైనపు బొమ్మలో సూదులు గుచ్చబడి ఉన్నాయి. హజ్రత్ జిబ్రయీల్ ఆదేశం ప్రకారం ఆయన ఆ రెండు సూరాలలోని ఒక్కో ఆయత్‌ను చదువుతూ పోతుంటే ఒక్కో ముడి విడిపోతుంది, సూది వచ్చేస్తుంది. సూరాలు పూర్తి అయ్యే అంతలో ముడులన్నీ విడిపోయాయి. సూదులు కూడా వచ్చేశాయి. ఆయన దేనితోనో బంధింపబడి ఉండి ఇప్పుడు ప్రతి బంధనం నుండి స్వేచ్ఛ లభించినట్లు అయిపోయారు. (ఫత్‌హుల్ బారీ)

దైవప్రవక్త (స) అలవాటుగా, రాత్రి నిద్రించేముందు సూరయె ఇఖ్లాస్, సూరయె ఫలఖ్ మరియు సూరయె నాస్ పఠించి అరచేతులపై ఊది వాటితో శరీరమంతా నిమిరేవారు. మొదట ముఖం తర్వాత శరీరంపై ముందు భాగం, ఆ తర్వాత ఆయన చేతులు చేరినంత మేరకు మూడుసార్లు ఇదేవిధంగా చేసేవారు. (బుఖారీ – హ.నెం.4630)

## 113. అల్ ఫలఖ్

**ఆయత్‌లు : 5** **అవతరణ : మక్కాలో**

آياتها 5 سُوْرَةُ الْفَلَقِ 113 مَكِّيَّةٌ رُكُوْعُهَا 1

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన
అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

قُلْ اَعُوْذُ بِرَبِّ الْفَلَقِ ﴿1﴾
مِنْ شَرِّ مَا خَلَقَ ﴿2﴾
وَمِنْ شَرِّ غَاسِقٍ اِذَا وَقَبَ ﴿3﴾
وَمِنْ شَرِّ النَّفّٰثٰتِ فِي الْعُقَدِ ﴿4﴾
وَمِنْ شَرِّ حَاسِدٍ اِذَا حَسَدَ ﴿5﴾ ع 1 5 38

(1) చెప్పండి : ఉదయానికి ప్రభువు అయిన వాని శరణు కోరుతున్నాను.

(2) ఆయన సృష్టించిన ప్రతి వస్తువు కీడు నుండి (3) చీకటి రాత్రి కీడు నుండి దాని అంధకారం వ్యాపించినప్పుడు

(4) గండమాలలపై చదివి ఊదేవారి కీడు నుండి (5) అసూయాపరుల అసూయ నుండి వారు అసూయ పడసాగినపుడు.

1 - 5 వాక్యాలు

దివ్య ఖుర్ఆన్‌లోని చివరి రెండు సూరాలయిన ఫలఖ్ మరియు నాస్ వేరు వేరు అయినా, వేర్వేరు పేర్లతో వ్రాయబడినా ఆ రెండింటి మధ్య పరస్పరం ఎంత గాఢ సంబంధం ఉందో వాటిలోని అంశాలు ఎంత దగ్గరగా సంబంధం కలిగి ఉంటాయంటే వాటికి ఉమ్మడిగా ముఅవ్వజతైన్ (శరణుకోరే రెండు సూరాలు) అని పేరు పెట్టబడింది. ఇవి అవతరించడం కూడ ఒకేసారి అవతరించాయి.

మక్కా ముఅజ్జమాలో ఈ రెండు సూరాలు అవతరించిన పరిస్థితుల స్వరూపం ఎలా ఉందంటే ఇస్లాం సందేశం ఆరంభం కాగానే, దైవప్రవక్త (స) తోడేళ్ళ మందలో చేయి పెట్టినట్లు అనిపించింది. సూరయె కాఫిరూన్‌లో తిరస్కారులతో స్పష్టంగా “మీ దారి మీది, నా దారి నాది” అని చెప్పబడినప్పుడు వారి శత్రుత్వం మరింత పెరిగిపోయింది. ప్రత్యేకించి ఇస్లాం స్వీకరించిన వ్యక్తుల, కుటుంబాల పట్ల వారి హృదయాలలో దైవప్రవక్త (స) పట్ల ఎల్లవేళలా అసూయా జ్వాలలు చెలరేగేవి. ఇంటింటా ఆయన (స)పై తిట్లూ, శాపనార్థాలు వినవచ్చేవి. ఏదో ఒక సమయంలో రాత్రివేళ రహస్యంగా హత్యచేయాలని రహస్య సమాలోచనలు జరగసాగాయి. ఆయన చనిపోవాలనో లేక తీవ్రంగా వ్యాధిగ్రస్తులు కావటమో లేక పిచ్చివాడయి పోవటమో జరగాలని ఆయనకు వ్యతిరేకంగా మంత్రాలు చేతబడులు చేయనారంభించారు. ఈ పరిస్థితులలో దైవప్రవక్త (స)కు చెప్పడం జరిగింది. “వారికి చెప్పండి, నేను ఉదయానికి ప్రభువు అయిన వాని శరణు వేడుతున్నాను. ప్రాణులన్నింటి కీడు నుండి, రాత్రి చీకటి నుండి, మంత్రగాళ్ళ కీడునుండి అసూయాపరుల కీడు నుండి. ఇంకా వారితో అనండి, నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్యునితో పలుమార్లు తిరిగి వచ్చే దురాలోచనలు రేకెత్తించే ప్రజల మనసుల్లో దురాలోచనలు కల్పించేవాని, అతడు జిన్నులలోని షైతాన్ అయినా, లేక మానవులలోని షైతాన్ అయినా శరణు వేడుతున్నాను.”